# ఉడ్ బి కలెక్టర్

బి. ఏ. పాసయి ఇంకేం చెయ్యాలా అని ఆలోచిస్తూ ఉండగా నా స్నేహితుని అక్క పెళ్ళికి వెళ్ళటం జరిగింది. పెళ్ళి కొడుకు ఐ. ఏ. యస్. ఆఫీసరు. సబ్ కలెక్టరుగా పనిచేస్తున్నాడు అప్పుడు. అప్పుడే అనుకొన్నాను నేనూ కలెక్టరు కావాలని.

ఈ కాలంలోకూడ (ఐమీన్, కార్మికులు యజమానులు తారతమ్యం లేకుండా జీవించాలనే ఈ విప్లవాత్మక యుగంలో కూడ) కలెక్టరుకున్న గ్లామరే గ్లామరు. పెద్ద బంగళా, కారు, మందీ, మార్బలము....ఎక్కడ క్యాంపుకు వెళ్ళినా "అయ్యగారు, అయ్యగారు" అని వణికిపోయే సిబ్బంది....ఇంచక్కా ప్రారంభోత్సవాలు అవీ చెయ్యొచ్చు. అన్ని పేపర్లలో ఫోటోలు పడుతాయి. చేస్తే అటువంటి ఉద్యోగమే చెయ్యాలి. లేకపోతే నాన్నగారిలా ఎదుగూ, బొదుగూ లేని బడి పంతుల ఉద్యోగం ఎవరు చేస్తారు? ఆయన ముప్పయి ఏండ్ల సర్వీసులో ఏ మార్పు కనిపించలా. అవే కాంపోజిషను పుస్తకాలు, అవే టెస్టు పేపర్లు........ అదే విధంగా అల్లరి చేసే విద్యార్థులు. ఈ మార్పులేని జీవితంతోనే ఆయన రేపోమాపో రిటైరవుతారు కూడా. పైగా 'ఒరే టీచరు ట్రైనింగుకు వెళ్ళారా' అని ప్రబోధిస్తుంటారు.

అందులో ఏం సుఖముందో నాకు అర్థంకాదు. ఇప్పుడు స్కూలు ఫైనలు పరీక్షలకు సూపర్వైజరుగా వెళ్ళట మంటే యుద్ధరంగంలోకి దిగటమే. పైకి అనకూడదు గాని ఆమధ్య మా నాన్నగారికి దేహశుద్ధి కూడా జరిగింది. కాని ఆయన పోలీసు రిపోర్టు ఇయ్యలేదు. అది వారి సహన గుణమో లేక పరువు పోతుందనే భయమో తెలీదు.

ఇక ముందేమి చెయ్యబోతవంటూ నాన్నగారు అడగ్గానే చెప్పాను 'ఐ. ఏ. యస్. పరీక్షకు వెళ్ళాలను కొంటున్నానండి."

"ఏమిటేమిటీ" అన్నారు జారిపోయే కళ్ళజోడు సవరించుకొంటూ. ఆ మాటే మళ్ళీ చెప్పాను.

"ఐ. ఎ. ఎస్. అంటే ఏదైనా ఊరు ప్రయాణమనుకున్నావా దర్జాగా తిరిగి రావటానికి".

నాకు బలే కోపం వచ్చింది. కాని నాన్నగారు గనుక నోరు మెదపలేక పోయాను. చివరకు నెమ్మదిగా అన్నాను. "ఇప్పుడు ఆ పరీక్ష పాసవటం ఏమంత కష్టం కాదండీ."

"ఓహో. బి.ఏ కంటే తేలికేమిటి?"

నేనేమీ మాట్లాడలేదు.

"కనీసం నీకు సెకండు క్లాసయినారాలేదు.

ఆ మాటకొస్తే మా నాన్నగారికీ సెకండు క్లాసు రాలేదు. కాని నోరు మూసుకున్నాను.

"సరే నీ ఇష్టం. ఆమోజూ తీర్చుకో. నాకు డబ్బు, నీకు కాలం దండుగకాక తప్పదు, ఏంచేస్తాం."

ఈ ముసలాళ్ళు ఎప్పుడూ ఇంతే. ఇదంతా జనరేషన్‌గ్యాప్.... అదే తరాల మధ్య తారతమ్యం.

అప్పటినుండి రోజూ యు.పి.యస్.సి. వారి ప్రకటన కోసం పేపరు చూడ సాగాను. ప్రకటన రాగానే అప్లికేషను ఫారంకోసం వ్రాశాను. అది మొదలు నా ఆలోచనలన్నీ ఆకాశంలోనే విహరించ సాగాయి.

అమ్మ నా పరీక్ష సంగతి తెలిసి పొంగిపోయింది. "నిన్న మొన్నటి వాడివి ఇంతలో కలెక్టరు పరీక్షకు వెళ్తున్నావా?" అని సంబర పడింది. పది మందిలో గొప్పలు చెప్పుకోసాగింది. మా ఊళ్ళో నాక్కొంచెం ప్రాముఖ్యం హెచ్చింది. రోడ్లలో కొంచెం కాలరు పైకెత్తి నిటారుగా నడవటం అలవరచు కొన్నాను.

మూడు రోజులు కష్టపడి అప్లికేషను ఫారం పూర్తిచేశాను. పరీక్ష ఫీజడిగితే నాన్నగారు మాట్లాడకుండా వంద రూపాయల కాగితం చేతిలో పెట్టారు. "చూడూ, తాలూకాఫీసులో యల్.డి.సి. ఉద్యోగం ఒకటి ఖాళీగా ఉందట ఏదో లీవ్‌వేకన్సీ, అక్కడ కొన్నాళ్ళు పని చేయ రాదూ" అన్నారు.

నేను గతుక్కుమన్నాను. నేను .... కాబోయే కలెక్టరును, నా జీవింతం యల్. డి. సి. గా మొదలు బెట్టాలా?

"ఏం. సుందరరామయ్యకు చెప్ప మంటావా?"

"పరీక్షలు...."

"పరీక్షలకేం వ్రాద్దువుగాని. సోమరిగా ఉండకుండా కాస్తడబ్బు సంపాదించినట్లూ ఉంటుంది. అటు అనుభవమూ వస్తుంది."

కలెక్టరుకు గుమస్తాగా అనుభవమెందుకు చెప్పండి మా నాన్న గారి చాదస్తంగాకుంటే.

"రివోల్టు, రివోల్టు" అని నా ఆత్మ ఘోషించింది. కాని ఇంకా పుస్తకాలకని, పరీక్షవ్రాసి రావటానికి ఐదారువందల పైనే ఖర్చౌంది. నాన్నగారు కష్టపడి సర్దగలరుగాని మొన్నీ మధ్యే నా సోదరీమణి పెళ్ళవటంతో మా ఆర్థికస్థితి కాస్తకుంటుంపడింది. కాబట్టి నేనూ వంద రూపాయలు సంపాయిస్తే దర్జాగా ఖర్చు పెట్టుకోటానికి వీలుంటుంది. ఇటు నాన్నగారిని తృప్తిపరచినట్లు ఉంటుందని ఒప్పుకున్నాను.

మా చుట్టాలాయన ఒకరు మద్రాసుకు వెళ్తుంటే జనరల్ నాలెడ్జి పుస్తకము, ఐ. ఎ. యస్. సాల్వ్‌డ్ క్వెశ్చన్ పేపర్సు అనేపుస్తకము తెప్పించి చదువు ప్రారంభించాను.

ఇంతలో నాకు యల్. డి. సి. ఉద్యోగం వచ్చింది. ఇంత త్వరలో నాకు ఉద్యోగం వచ్చిందని చాలామంది ఈర్ష్యపడ్డారు కూడ. స్నేహితులందరికీ బాలాజీకేఫ్‌లో వడ, సాంబారు పెట్టించి వాళ్ళ కడుపుబ్బటానికి మరీ గర్వంగా చెప్పాను. "ఈబోడి ఉద్యోగం చెయ్యాలని లేదోయ్. ఏదో నాన్నగారి పోరుపడలేక చేస్తున్నాను. ఐ. ఏ యస్.కు చదువుతున్నాను. ఐ.విల్ బి ఎ కలెక్టర్ సూన్" చాలా మందికి తింటున్న వడగొంతుకు అడ్డం పడింది .... .... మరి కొందరికి అజీర్ణం కూడా చేసిందట ఆ తర్వాత.

ఆఫీసులో పని బలే చికాకుగావుంది. స్వేచ్ఛావిహారం చేసే సింహంగాన్ని పంజరంలో పెట్టినట్లుంది. ఆ పైల్సుగొడవా. అంటే తలనొప్పి వచ్చేది. అంతేగాక నేను వ్రాసిన ప్రతి నోట్‌లోనూ వంద తప్పులు వెదకుతాడు ఆదుర్మార్గుడు.... అదే హెడ్ క్లర్కు.

ఆరోజు అర్జంటుపనేమీలేదు. కడుపు నిండా భోజనంచేసి వచ్చా నేమో కాస్తకునుకు పట్టింది. ఇంతలో మా యముడి గర్జన వినిపించి ఉలికిపడి లేచాను. "ఆ ఫైలు పంపలేదు. ఈ నోట్ పుటప్ చెయ్యలేదు" అని విసుక్కుంటున్నాడు. ఎప్పుడూ పై తరగతిలోనివాడు క్రింది వానిపై హుకుం చెలాయించాలని చూస్తాడుగా. నేను నింపాదిగానే జవాబిచ్చాను. 'ఆపని నాదికాదు. శేఖరంగారిది."

"శేఖరం సెలవులో ఉన్నాడు. ఆ ఫైళ్ళు మీరే చూడాలి."

ఆవిధంగా ఆఫీసు ఆర్డరులేదన్నాను. "నేను చెబుతుండగా ఆఫీసు ఆర్డరు ఎందుకు!" అన్నాడు.

"నువ్వెవరు చెప్పటానికి." అన్నాను

"కళ్ళు నెత్తి కెక్కాయా?"

"నోరు దగ్గర పెట్టుకు మాట్లాడండి. నేనేం మీ ఇంట్లో నౌకరును కాదు. అందరూ గవర్నమెంటు ఉద్యోగులమే." అన్నాను.

"చేస్తున్నావులే గొప్ప ఉద్యోగం కలెక్టరునను కొంటున్నావా ఏమిటి?"

"అలాగే చూస్తూఉండు. కలెక్టరునుఅవుతానో లేదో నీకే తెలుస్తుంది."

ఇది చివికిచివికి గాలివాన అయింది. ఫలితంగా నా ఉద్యోగం పోయింది. పోతేపోయింది. హాయిగా చదువుకోవచ్చు అనుకున్నాను. రేపు అంతా చక్కబడి నేను కలెక్టరు నయినప్పుడు ఈ హెడ్ క్లర్కుపని ఎలాగయినా పట్టాలనుకున్నాను.

నాన్నగారు చెడామడా తిట్టారు. "నీకు రెట్టింపు వయసుంటుంది ఆయనకు. ఆయన్ను అన్ని మాటలంటావా?" అన్నారు. వయసుంటే ఆయనదగ్గరుంటుంది. నాకేం అనుకొన్నాను.

"ఏదో గొప్ప పోతున్నావు. నీ తిరుగుళ్ళకు, నీ గర్వానికి నీవీ పరీక్ష పాసుకాలేవు. నోరుమూసుకొని వచ్చేఏడు టీచరు ట్రైనింగుకు వెళ్ళు."

నాకు ఒళ్ళుమండిపోయింది. అయినా నిగ్రహించుకున్నాను. ఈ కష్టాలు కొన్నాళ్ళేకద. నేను కలెక్టరునయిన తర్వాత మా నాన్నగారే

నన్ను నెత్తిన పెట్టుకోరూ.

పరీక్షలు దగ్గరవుతున్నాయి. శ్రద్ధగానే చదువుతున్నాను. ఆ పుస్త కాలన్నీ ఇంచుమించు కంఠత వచ్చేలా చదివాను. పరీక్షలు వ్రాయటానికి వెళ్ళేముందు నాన్నగారు కూడా చాలా ఆర్ద్రంగా "బాగావ్రాయి" అన్నారు. ఇప్పుడు ఈ ముసలాయన నన్ను గుర్తించగలిగాడని నాలో నవ్వు కొన్నాను.

పరీక్ష పేపర్లు బాగానే వ్రాశాను. అందరికంటే ఎక్కువ పేజీలే వ్రాశాను. ఆ హాల్లో ఎవరూ అంత బాగా వ్రాయలేదను కొంటాను. నేను తప్పక సెలక్టవుతాననే నమ్మకం నాకు కలిగింది.

రెండు నెలలు నిరీక్షణలో అతికష్టంమీద గడచాయి ఫలితాలు రానేవచ్చాయి. నా నంబరు కోసం ఆదుర్దగా వెతికాను ఇదిగో ఇది నా నంబరే. కెవ్వున అరవాలనిపించింది. దడదడలాడే గుండెతో నా రోల్ నంబరున్న కాగితంతెచ్చి చూశాను.... మైగాడ్.... ఇది నా నంబరుకు ముందున్న నంబరు. మరి నాది? ఏదో పొరపాటు జరిగే ఉంటుంది. లేకపోతే నేను సెలక్టు కాకపోవడమేమిటి?

నాన్నగారు నవ్వి ఊరుకొన్నారు. అమ్మ మాత్రం ఏదో పొరపాటు జరిగే ఉంటుందనుకొంటుంది. అంతా సర్దుకొంటే తిరుపతి దర్శనానికి వెళ్ళి నా తలనీలాలు సమర్పిస్తానని మ్రొక్కింది.

మార్కులషీటు వచ్చాక నా తలగిర్రున తిరిగి పోయింది. మొట్ట మొదటి సారిగా నాదెంత పరిమిత జ్ఞానమో అర్థ మయింది. వారం రోజు లపాటు వీధిలో మొహం చూపించలేకపోయాను.

నాలుగేండ్ల తర్వాత ఇప్పుడు నా కోరిక తీరింది. ఏమయితేనేం కలెక్టరును కాగలిగాను. దర్జాగా, ఠీవిగా యూనిఫారంలో నిలబడి రైలు టిక్కెట్లు కలెక్టు చేస్తూ ఉన్నాను.